




రవాణాకు సిద్ధంగా ఉన్న ఉప్పు బస్తాలు



నౌపడలో తయారైన ఉప్పు

సంక్షోభంలో నౌపడ ఉప్పు



నౌపడ ఉప్పు పరిశ్రమ.. ఒకప్పుడు ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో, దేశంలో మూడో స్థానంలో ఉండేది. ఇక్కడి నుంచి నాలుగైదు రాష్ట్రాలకు ఉప్పు ఎగుమతి అయ్యేది. అలాంటి పరిశ్రమ ఇప్పుడు సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకపక్క పెరిగిన పెట్టుబడులు, మరోపక్క తగ్గిన దిగుబడులు, ఇంకొకపక్క గిట్టుబాటుకాని ధరలతో రైతులు కుదేలవుతున్నారు. భూముల లీజును కేంద్రం రెన్యువల్ చేయకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఫలితంగా దిగుబడి లక్షల టన్నుల నుంచి వేలకు పడిపోయింది. పంట నాణ్యత తగ్గడంతో కేవలం ఒక్క రాష్ట్రానికే ఎగుమతికి పరిమితమైంది. ప్రభుత్వాలు ఆదుకొని ఉప్పు పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

- ప్రాభవం కోల్పోతున్న పరిశ్రమ
- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు
- దోచుకుంటున్న వ్యాపారులు.. నష్టపోతున్న రైతులు
- ఇతర ప్రాంతాలకు వలస
- భూముల లీజును రెన్యువల్ చేయని కేంద్రం

సంతబొమ్మాళి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భావనపాడు, మర్రిపాడు, శెలగపేట, నౌపడ, మూలపేట, ఆర్.సున్నాపల్లి, యామలపేట తదితర గ్రామాల్లో గతంలో 5వేల ఎకరాల్లో రైతులు ఉప్పును పండించేవారు. ప్రతీ ఏడాది లక్ష టన్నుల ఉప్పు దిగుబడి అయ్యేది. అయితే, 2018లో 2వేల ఎకరాల ఉప్పు భూములకు సంబంధించి లీజు పూర్తయింది. వాటిని కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయలేదు. మిగతా 3 వేల ఎకరాల భూములకు 2027తో లీజు పూర్తి కానుంది. ఉప్పు భూములను కేంద్రం రెన్యువల్ చేయకపోవడంతో చాలా మంది రైతులు వలస వెళ్లిపోయారు. దీంతో గత ఏడాది 25వేల టన్నుల మాత్రమే ఉప్పు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం క్వింటా ఉప్పు రూ.300 పలుకుతుంది. దిగుబడి బాగా వచ్చిన రోజుల్లో క్వింటా రూ.100 నుంచి రూ.150కే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఉప్పు సాగులో పెట్టుబడులు పెరిగిపోవడంతో పాటు ధర నిలకడగా లేకపోవడంతో నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి..

ఉప్పు మడులను ఏటా డిసెంబరులో తయారు చేస్తారు. 20రోజుల్లో దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. జూన్ వరకు పంట దిగుబడి కొనసాగుతుంది. అయితే, ఇటీవల కాలంలో వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాలు కురుస్తుండడంతో ఉప్పు పంట నాశనమై రైతులు కుదేలవుతున్నారు. మళ్లీ మడులు ఎండిన తర్వాతే పంట దిగుబడి ప్రారంభమవుతుంది. దీనివల్ల దిగుబడి కాలం తగ్గిపోతుంది. ఉప్పు పంటకు సముద్రపు, బోరుబావుల నీరు తోడేందుకు డీజిల్ మోటర్లను వినియోగిస్తారు. ఒక ఎకరాలో ఉప్పును పండించేందుకు ఆరు నెలలకు గాను (మిగతా 6వ పేజీలో...)



ఉప్పు మడులు

కూరగాయలు ఇవ్వట్లే!

- గురుకులాలకు సరఫరా చేయని కాంట్రాక్టర్లు
- రూపాయికే 13 రకాల కూరగాయలు అందిస్తామని గతంలో దక్కించుకున్న టెండర్లు
- ఇప్పుడు చేతులెత్తేసిన వైనం
- పట్టించుకోని అధికారులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



మెళియాపుట్టి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గురుకులాలకు గత కొంత కాలంగా కూరగాయలు సక్రమంగా సరఫరా కావడం లేదు. రూపాయికే 13 రకాల కూరగాయలు అందిస్తామని కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. అయితే, ఇప్పుడు ధరలు పెరగడంతో కూరగాయలను సరఫరా చేయడం లేదు. గత ఐదేళ్లుగా టెండర్లు దక్కించుకుంటున్నవారు ఇలాగే చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మార్పులు చేయాలని చూసినప్పటికీ కాంట్రాక్టర్లు సిండికేట్ కావటంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మెళియాపుట్టి మండలం పెద్దమడి గురుకుల పాఠశాలలో సుమారు 425 మంది, కళాశాలలో 208 మంది, ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో 281 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ గురుకులాలకు అవసరమైన కూరగాయలను సరఫరా చేసేందుకు ప్రతిఏటా ఐటీడీఏ అధికారుల సమక్షంలో టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తుంటారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఆగస్టు 21న అప్పటి ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వీవీ రమణ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఒక్కో పాఠశాలకు కూరగాయలను కేజీ రూ.175 నుంచి రూ.250 వరకు సరఫరా చేస్తామని సిండికేట్ అయి ముందుకు వచ్చారు. మొత్తంగా 22 రకాల కూరగాయలకు గాను పలువురు టెండర్లు దక్కించుకున్నారు. ఇందులో బీరకాయలు, బీట్‌రూట్, కాలీఫ్లవర్, పొడుగు చిక్కుడు, పచ్చిమిర్చి, అల్లం, మునగకాడలు, ముల్లంగి, అరటికాయలు, క్యారెట్, గుత్తి వంకాయ, పాలకూర, మెంతుకూర, గోంగూర వంటి 13 రకాల కూరగాయలను ఒక రూపాయికే అందిస్తామని టెండర్లు దక్కించుకున్నారు. తీరా వీటిని సరఫరా చేయడంలో మాత్రం చేతులెత్తేశారు.

కానరాని తనిఖీలు

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను విభజించింది. దీంతో జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయింది. ఐటీడీఏ అధికారులు ఎంతసేపూ మన్యం జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలకే హాజరవుతున్నారు. జిల్లాలోని ఐటీడీఏ మండలాల వైపు కన్నెత్తి చూడడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఐటీడీఏ పీవోలను తరచూ బదిలీలు చేస్తుండడంతో పాలనా వ్యవహారాలపై వారికి పట్టుదొరకడం లేదు. ఇది ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పనిచేస్తున్న వార్డెన్లకు కలిసివస్తుంది. మెనూ అమలు, నాణ్యమైన కూరగాయలు సరఫరా జరుగుతున్నాయా? లేదా?, గిరిజన విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు వంటి అంశాలపై అధికారుల తనిఖీలు కానరావడం లేదు. ప్రస్తుత ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఇటీవల పెద్దమడి ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. దీంతో కూరగాయలు సరఫరా కావడం లేదని, మెనూ సక్రమంగా అమలు కాని విషయం బయట పడింది.

పెరిగిన ధరలు

ప్రస్తుతం కూరగాయల ధరలు బాగా పెరిగాయి. ఇందులో గురుకుల పాఠశాలలకు కాంట్రాక్టర్లు ఒక రూపాయికే సరఫరా చేస్తామని చెప్పిన కూరగాయలు కూడా ఉన్నాయి. పొడుగు చిక్కుడు కేజీ రూ.50, అల్లం రూ.40, పచ్చిమిర్చి రూ100, క్యారెట్ రూ.60, మునగకాడలు రూ.70, వంకాయలు రూ.50, గోంగూర రూ.40, మెంతుకూర రూ.30, పాలకూర రూ.30, అరటి కాయ ఒకటి రూ.10, పలుకుతున్నాయి. వీటిని కారు చౌకగా సరఫరా చేస్తామని చెప్పి టెండర్లు దక్కించుకున్న వారు ఇప్పుడు చేతులెత్తేశారు.

ఎలా నమ్మేశారో?

రూపాయికే 13 రకాల కూరగాయలు సరఫరా చేస్తామంటే అధికారులు ఎలా నమ్మేశారు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఐదేళ్ల నుంచి కూరగాయల కాంట్రాక్టును ఒకే వ్యక్తికి అప్పగిస్తున్నట్లు తెలుస్తుంది. కొంత మంది గురుకుల, ఆశ్రమ పాఠశాలల సిబ్బందితో ముందే మాట్లాడుకొని, కొంత డబ్బులు వారికి ఇవ్వటానికి ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కూరగాయలు సరఫరా చేయకపోయినా చేసినట్లు గురుకుల సిబ్బంది చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాశిరకం కూరగాయలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని గురుకులాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. గత ఐదేళ్ల నుంచి ఇటువంటి తంతు జరుగుతున్నా పట్టించుకున్న వారు కరువయ్యారు.

అధికారులకు చెబుతున్నాం

దసరా సెలవుల తరువాత మా గురుకులానికి కూరగాయల సరఫరా జరుగుతుంది. కూరగాయల సరఫరాపై ఎప్పటికప్పుడు మా పైఅధికారులకు చెబుతున్నాం.

-అజిత్, ప్రిన్సిపాల్,
పెద్దమడి గురుకుల పాఠశాల.

పలాసను నివాసంగా చేసుకొని..

- గంజాయి అక్రమ రవాణా
- పట్టుబడిన ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు
- 48 కిలోల సరుకు స్వాధీనం



రైల్వే పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులు, స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

పలాస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలాసను నివాస కేంద్రంగా చేసుకొని గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను రైల్వే పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.5 లక్షల విలువైన 48 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. సీఐ రవికుమార్, ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శివంకుమార్‌చౌదరి, బదాయిమహాపాత్రో, సాహిబ్‌కుమార్‌చౌదరి వ్యాపారం చేసుకుంటామని పలాస పద్మనాభపురం కాలనీ వాసులకు నమ్మబలికి ఆరు నెలల కిందట ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వారు పగలంతా ఒడిశా రాష్ట్రం వెళ్లి గంజాయి పండించే రైతులకు నగదు ఇచ్చి, వారితో సరుకును ఆంధ్రా బోర్డర్ వరకూ తెప్పించుకునేవారు. రాత్రులు గంజాయిని ఇంటికి తీసుకురావడం, ఎవరికీ అనుమానం రాకుండా రైలులో బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం వారు ఒడిశాలోని ఆర్.ఉదయగిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి, పలాస మీదుగా ముంబాయికి తరలించేందుకు బ్యాగులతో స్థానిక రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ప్లాట్‌ఫారంపై వారు అనుమానస్పదంగా సంచరిస్తుండడంతో రైల్వే పోలీసులకు అనుమానం వచ్చి బ్యాగులు తనిఖీ చేశారు. దీంతో పరారీ అయ్యేందుకు సిద్ధమవడంతో పోలీసులు వారిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. బ్యాగుల్లో రెండు కిలోల చొప్పున మొత్తం 48 కిలోల గంజాయి లభించింది. వాటి విలువ రూ.2.40 లక్షలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.5 లక్షలకు పైబడి ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి విశాఖపట్నం రైల్వే కోర్టులో సోమవారం హాజరుపరచనున్నట్లు తెలిపారు.



ఖాదీకి కేరాఫ్.. పొందూరు 6లో



రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ప్రారంభం 6లో

ఇరిగేషన్.. ఇండస్ట్రీ..

- ఇదే మా నినాదం
- భోగాపురం-మూలపేట మధ్య కోస్టల్ కారిడార్
- జిల్లాలో టైటానియం కాంప్లెక్స్
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పక్కన ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వలసలను నివారించడమే ధ్యేయంగా శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. 'ఇరిగేషన్..ఇండస్ట్రీ.. ఇదే మా నినాదం' అని అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి ప్రజాసదన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టును అనుసంధానిస్తూ కోస్టల్ కారిడార్ నిర్మాణానికి డీపీఆర్‌లు రూపొందిస్తున్నాం. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు. జిల్లా అభివృద్ధిపై గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించలేదు. జిల్లాలో చాలా సమస్యలు పరిష్కారం కోసం సీఎం తక్షణ నిర్ణయాలు తీసుకున్నారు. ఇరిగేషన్, ఇండస్ట్రీ ఈ రెండు మా ప్రాధాన్యతలు. జిల్లాలో నాలుగు ప్రధాన నదులు ఉన్నాయి. వీటిపై గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. వంశధార ఫేజ్ 2, స్టేజ్ 2 పనులను జూన్ 2025 నాటికి పూర్తిచేయడమే లక్ష్యం. 19 టీఎంసీల నీటిని నిల్వ చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. నాగావళి, వంశధార నదుల అనుసంధానం పూర్తి చేస్తాం. ఇందులో 5వేల ఎకరాలు ముంపునకు గురికాకుండా కొత్త డిజైన్లు రూపొందించాలని, భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని చెప్పాం. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం కొత్త డీపీఆర్ తయారీ చేయాలని సూచించాం. పలాస మండలం కేదారిపురం వద్ద మూడు కిలోమీటర్ల పైప్‌లైన్ వేసి పలాస కాశీబుగ్గ జంట పట్టణాలకు మంచినీటిని అందిస్తాం. బహుదా నదిపై పలు కీలక పనుల కోసం రూ.30 కోట్లు అవసరం. ఈదుపురంలో ఎత్తిపోతల పథకం, 11 ఓపెన్ హెడ్స్ చానెల్స్ పైడిగాం ప్రాజెక్టు అభివృద్ధికి ఈ నిధుల వెచ్చిస్తాం.' అని తెలిపారు.

మూలపేటలో ఫార్మాహబ్

'మూలపేట పోర్టు సమీపంలో 10 వేల ఎకరాల ల్యాం డ్ బ్యాంక్ ఉంది. ఇక్కడ ఫార్మా హబ్, బయోటెక్ హబ్ నిర్మిస్తాం. ఏడాదిలో పోర్టు పూర్తవుతుంది. రూ.20వేల కోట్ల టర్నోవర్ జరిగేలా బీచ్ సాండ్ ప్రాజెక్టులు కూడా అభివృద్ధి చేస్తాం. 20వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇసుక నుంచి ముఖ్య ఖనిజాలను వేరుచేసే టైటానియం కాంప్లెక్స్‌ను ఇక్కడ స్థాపిస్తాం. మూలపేట సమీపంలో ఎయిర్‌పోర్టు నిర్మించడానికి ప్రయత్నాలు జరు గుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసి సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. నరసన్నపేట జమ్ము జంక్షన్ నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రోడ్డును ఆరు లైన్లగా రూపొందిస్తాం. కళింగపట్నం-పార్వతీపురం రోడ్డు, అలాగే బత్తిలి-అలికాం రోడ్డు జాతీయ రహదారుల సంస్థలోకి వెళ్లేలా ప్రయత్నిస్తున్నాం. డోల-పోలాకి-నౌపడ రోడ్డు అభివృద్ధికి జాతీయ రహదారి సంస్థ నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే కోరాం.'

అరసవల్లి, శ్రీకూర్మం అభివృద్ధి చేస్తాం

'ప్రసాదం' అనే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు ద్వారా జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం దేవాలయాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం.టెంపుల్ సర్క్యూట్ టూరిజం అభివృద్ధి చేయాలి. జిల్లా కేంద్రంలో డచ్ బంగ్లా చుట్టూ నగర వాసులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ దొరికేలా టూరిజం ప్రాజెక్టులను రూపొందిస్తున్నాం. కోడి రామ్మూర్తి స్టేడియం త్వరగా పూర్తి చేస్తాం. పాత్రునివలసలో 33 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాం. నాలుగు ప్రత్యేక సింథటిక్ స్పోర్ట్స్ మైదానాలు నిర్మిస్తున్నాం. క్రీడా వికాస ప్రాంగణాలు పూర్తి చేస్తాం. మన జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి కరణం మల్లేశ్వరి సహాయాన్ని కోరాం. ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ ఇతర యంత్రాంగం జిల్లా అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నారు.' అని రామ్మోహన్ అన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ..జిల్లా కేంద్రం చుట్టూ రింగ్ రోడ్డు ప్రతిపాదన సిద్ధమవుతుందని అన్నారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల రూ.5.5 కోట్లు విడుదలయ్యాయని, ఇంకా రూ.10 కోట్లు త్వరలో విడుదలవుతాయన్నారు. త్వరితగతిన రోడ్డు పూర్తిచేస్తామన్నారు. కేఆర్ స్టేడియం, కరకట్టలు, వమరవెల్లి లిఫ్ట్ ఇరిగేషన్, జిల్లా కేంద్రంలోని ప్రధాన ముఖద్వారాలు, ప్రధాన కూడళ్లు, అరసవల్లి, శ్రీకూర్మం దేవాలయాల అభివృద్ధిని వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదీకి కేరాఫ్.. పొందూరు

- ప్రపంచ స్థాయి గుర్తింపు
- ఆదుకోని ప్రభుత్వాలు
- అవార్డులతో సరిపెట్టేస్తున్న వైనం
- కార్మికులను అందని సాయం



ఖాదీ వస్త్రాలను నేస్తున్న నేత కార్మికులు

పొందూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖాదీవస్త్రాలు పేరు చెబితే ఠక్కున గుర్తుకు వచ్చేది పొందూరు. ఇక్కడ తయారు చేసి ఖాదీకి ప్రపంచఖ్యాతే కాదు.. స్వాతంత్ర్య సమరంలో కీలకపాత్ర పోషించిన గుర్తింపు ఉంది. స్వదేశీ ఉద్యమంలో విదేశీవస్త్రాలను బహిష్కరించిన సమయంలో దేశానికి స్వదేశీవస్త్రాలన అందించింది పొందూరు ఖాదీ రంగం. ప్రముఖులే కాదు, రాజకీయ నాయకులు సైతం పొందూరు ఖాదీ అంటే పడిచస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాలు, నగరాలతో పాటు విదేశాలకు సైతం ఇక్కడి నుంచి ఖాదీవస్త్రాలు ఎగుమతవుతున్నాయి. పొందూరు ఖాదీఖ్యాతి, డిమాండ్ ఖండాంతరాలు దాటుతున్నా.. ప్రోత్సాహం లేక నేత, వడుకు కార్మికులు ఈ రంగాన్ని వీడుతున్నారు. జాతిపిత గాంధీని సైతం అబ్బురపరిచిన పొందూరు ఖాదీకి ప్రభుత్వం నుంచి అంతగా ప్రోత్సాహం కానరావడం లేదు.

అంతా చేతితోనే..

ఎన్ని రకాల వస్త్రాలున్నా పొందూరు ఖాదీకి ఉన్న ప్రత్యేకత, గుర్తింపు వేరు. దీనికి కారణం తయారీ విధానమే. పొందూరు ఖాదీ వస్త్రాలు మొత్తం చేతిమీదే జరుగుతాయి. నూలు తయారీ నుంచి వస్త్రాలు తయారీ వరకు కార్మికుల నైపుణ్యం కనిపిస్తునే ఉంటుంది. ప్రత్యేకంగా పండించిన కొండపత్తి, ఎర్రపత్తిని స్థానిక ఖాదీవడుకు కార్మికులు తొమ్మిది ప్రక్రియల్లో నూలు (దారం) తయారు చేస్తారు. నూలు ఎంత సన్నమైతే అంత నాణ్యమైనదని అర్థం. నూలు 60 కౌంటు నుంచి 100 కౌంటు వరకు ఉంటుంది. నూలు వడుకు కార్మికులు తయారు చేసిన దారంతో సరి చేస్తారు. ఇదే నూలుతో వస్త్రాలు తయారు చేస్తారు. వీటిలో 100 కౌంటు పొట్నూలు వస్త్రాలకు ఉన్న ప్రత్యేకత చెప్పాల్సిన అవసరం లేదు. 100 కౌంటులో తయారైన పంచెలు, షర్టింగ్ వస్త్రాలు, చీరలకు ఏంటో డిమాండ్ ఉంది. వీటిని విదేశాలకు సైతం ఎగుమతి చేస్తుంటారు.

ఏఎన్ఆర్ బోర్డరు పంచెలకు డిమాండ్..

ముఖ్యంగా ఖాదీ వస్త్రాలకు డిమాండ్ పెరగడా నికి కారణం ఈ వస్త్రాలు హుందాతనాన్ని ఇవ్వడ మే కాకుండా సౌకర్యంగా ఉంటాయి. వేసవిలో చల్లదనాన్ని, శీతాకాలంలో వెచ్చదనాన్ని ఇచ్చే ఖాదీవస్త్రాలు రాజకీయ, సినీరంగ ప్రముఖులు వీటిని ధరించడమూ ఓ కారణమే. సినీరంగంలో అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్ఆర్), ఎన్టీఆర్, కృష్ణ, గుమ్మడి వంటి ప్రముఖ నటులు పొందూరు వస్త్రాలనే ధరించేవారు. ముఖ్యంగా ఏఎన్ఆర్ ప్రత్యేకంగా నేయించుకున్న పొందూ రు ఖాదీపంచెలు ఆయన జీవించి ఉన్నంతవరకూ వాడేవా రు. ఇప్పటికీ సినీరంగంలో ఎంతో మంది పొందూరు ఖాదీవస్త్రాలనే వినియోగిస్తున్నారు. ఏఎన్ఆర్ ప్రత్యేకంగా తయారు చేయించుకున్న పంచెలు నాగేశ్వరరావు బోర్డరు పేరుతో ఖ్యాతి పొందాయి. ఈ పంచెలు అత్యంత ఖరీదైనా వీటిపై ఇప్పటికీ మోజు తగ్గలేదు. సినీరంగంతో పాటు రాజకీయ రంగంలోను ఎంతోమంది పొందూరు పంచెలు, వస్త్రాలే వాడతారు. దివంగత వైఎస్ఆర్ పొందూరు పంచెలు, ఖాదీషర్టులే వినియోగించారు. పొందూరు ఖాదీవ స్త్రాలు వాడని రాజకీయ నాయకుడు లేరంటే అతిశయోక్తి లేదు.

ఖరీదైనా డిమాండ్..

ఖాదీ వస్త్రాలు ఖరీదుతో కూడుకున్న వస్త్రాలు. 100 కౌంటు ఖాదీవస్త్రాలు ధర రూ.2000 పైమాటే. ఇంత ఖరీదైనా డిమాండ్‌కు లోటులేదు. పొందూరులో తయారైన ఖాదీ వస్త్రాలు ఎప్పటికప్పుడు ప్రముఖులకు, విదేశాలకు ఎగుమతి అవుతుండడంతో డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఖాదీ పంచెలకు, చీరలకు ఉన్న డిమాండ్ చెప్పాల్సిన అవసరం లేదు.



ఖరీదైన పొందూరు పొట్నూలు వస్త్రాలు

కనుమరుగవుతున్న కార్మికులు..

ఖాదీవస్త్రాలకు ఎంత డిమాండ్ ఉన్నా.. ఈ రంగంపై వడుకు, నేత కార్మికులు మాత్రం ఆసక్తి కనబరచడంలేదు. వడుకు, నేత ప్రక్రియ అత్యంత కఠినమైనది కావడంతో వీటి తయారీ చాలా నెమ్మదిగా జరుగుతుంది. రోజంతా కష్టపడినా గిట్టుబాటు కాకపోవడంతో భవిష్యత్తు తరం ఈ రంగంపై ఆసక్తి చూపడడం లేదు. దీంతో పాత తరం కార్మికులపైనే ఆధారపడాల్సి వస్తోంది. పాతతరం కనుమరుగైతే ఖాదీవస్త్రాల ఉత్పత్తి కష్టమే. ఖాదీవస్త్రాల పేరుతో నకిలీఖాదీ వస్త్రాలు మార్కెట్‌ను ముంచెత్తుతుండడంతో ఖాదీవస్త్రాల మనుగడ, కార్మికుల జీవనం కష్టమైపోతోంది.



దారం వడుకుతున్న కార్మికురాలు

పనికల్పిస్తున్న ఏఎఫ్‌కేకే సంఘం..

పొందూరు ఖాదీవస్త్రాల తయారీలో నేత, వడుకు కార్మికులకు పని కల్పిస్తూ స్థానిక ఏఎఫ్‌కేకే సంఘం అండగా నిలుస్తుంది. సుమారు 8 దశాబ్దాల క్రితం కార్మికుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన ఈ సంఘం కార్మికులకు పని కల్పిస్తుంది. ప్రస్తుతం ఏడాదికి రూ.3 కోట్ల వరకు వ్యాపారం చేస్తున్న ఏఎఫ్‌కేకే సంఘం పరిస్థితి కార్మికులపై ఆధారపడి ఉంది. కార్మికులు తగ్గిపోతుండడంతో సంఘం పరిస్థితి దినదినగండంగా మారింది. మార్కెట్‌ను ముంచెత్తుతున్న నకిలీ ఖాదీ వస్త్రాలు ఈ సంఘాన్ని కష్టాల్లోకి నెట్టుతున్నాయి.

విదేశీయులు పరిశీలన..

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు ఖాదీవస్త్రాల నేత ప్రక్రియ, వస్త్రాలు చూడడానికి కేంద్ర, రాష్ట్ర అధికారులు, ప్రముఖులే కాదు, విదేశీయులు వస్తుంటారు. ఖాదీ వస్త్రా లను పరిశీలించేందుకు వచ్చిన గాంధీ మునిమనుమరాలు తారా భట్టాచార్య సైతం పొందూరు ఖాదీవస్త్రాలకు ముచ్చట పడ్డారు. స్వాతంత్ర్య సాధనలో భాగంగా దూసి రైల్వేస్టేషన్‌కు వచ్చిన జాతిపిత గాంధీకి కనిమెట్ట స్వాతంత్ర్య సమరయోధులు పొందూరు ఖాదీ వస్త్రాలను బహుమతిగా ఇచ్చారు. వీటిని చూపిన గాంధీ కార్మికుల పనితనాన్ని ప్రశంసించారు.

మాటలకే పరిమితం..

పొందూరు ఖాదీరంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమ చూపిస్తున్నాయి. ఖాదీరంగాన్ని ఆదుకుంటామని, కార్మికుల స్థితిగతులను మారుస్తామని నాయకుల మాటలు నీటిమూటలే అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పొందూరు ఖాదీని వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్ పథకంలో ఎంపిక చేసినా అవార్డుకు మాత్రమే పరిమితమైంది. ఆర్థిక సాయం చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు.. అవార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కానరాని భౌగోళిక గుర్తింపు..

పొందూరు ఖాదీవస్త్రాలకు మరింత గుర్తింపు, గౌరవం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు (జీఐ) కల్పిస్తామని చెపుతున్న వాగ్దానాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు కల్పించాలని పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం జీఐ ఇస్తే ఖాదీరంగం కొంతమేరకు పురోభివృద్ధి చెందుతుంది.



ఆర్థికంగా ఆదుకోవాలి..

ఖాదీరంగం, ఖాదీకార్మికులు అభివృద్ధి చెందాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏఎఫ్‌కేకే సంఘాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి. కేంద్ర ప్రభుత్వం పొందూరు ఖాదీకి భౌగోళిక గుర్తింపు కల్పిస్తే నకిలీ ఖాదీవస్త్రాలను అరికట్టవచ్చు.

-జి.కామేశ్వరప్రసాద్ అధ్యక్షుడు, ఏఎఫ్‌కేకే సంఘం



గిట్టుబాటు కావడం లేదు..

ఖాదీ వస్త్రాల నేత ప్రక్రియ కష్టతరం కావడంతో నేత నెమ్మదిగా ఉంటుంది. వస్త్రాల నేతకు ఇస్తున్న మజూరు గిట్టుబాటు కావడం లేదు. అందుకే మా ఇంటిలో నేటి తరం పిల్లలు ఈ రంగంలోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం మా పనితనానికి మెచ్చి అవార్డులు ఇస్తుందే తప్పా ఎటువంటి ఆర్థిక ప్రయోజనం కల్పించడం లేదు.

-ఆకాశం పైడిరాజు, ఖాదీనేత కార్మికుడు, పొందూరు



పరిస్థితి దయనీయం..

ఖాదీవస్త్రాల తయారీకి వడుకు కార్మికులే గుండెకాయ. కాని వడుకు కార్మికులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదు. రోజంతా కష్టపడితే 100 కౌంటు శిల్ప ఒక్కటి మాత్రమే తయారవుతుంది. రోజు కూలి రూ.100 కూడా గిట్టుబాటు కావడం లేదు. వడుకు కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటేనే ఖాదీ రంగానికి మనుగడ ఉంటుంది.

-బస్వా సరస్వతి, వడుకు కార్మికురాలు, పొందూరు

నేడు తొలి కార్తీక సోమవారం

- 12న ఏకాదశి.. 15న కార్తీక పౌర్ణమి



టెక్కలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హరిహరాదులకు ఇష్టమైన నెల కార్తీకమాసం. చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరించడం వల్ల కార్తీక మాసం అనే పేరు వచ్చింది. మిగిలిన నెలల కంటే కార్తీక మాసానికి ఎంతో విశిష్టత ఉందని స్కంద పురాణంలో పేర్కొన్నారు. అవకాశం ఉన్న మేరకు భక్తులు బ్రహ్మముహూర్తంలో లేచి స్నానం ఆచరించి పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. అలాగే మరికొందరు నదీ స్నానాలు చేయడం, అవకాశం ఉన్నవారు ఆలయ ప్రాంగణాల్లో ఆకాశదీపాలు వెలిగించడం, తులసి, ఉసిరి చెట్లు దగ్గర పూజలు చేయడం, కార్తీక పురాణాలు చదవడం వంటి కార్యక్రమాలతో సందడి కనిపిస్తుంది. శివాలయాలకు వెళ్లే భక్తులు మారేడు (బిల్వపత్రం)తో పాటు జిల్లేడు పువ్వులు, పారిజాతం, శంఖం, ఉమ్మెత్తి తదితర రకాల పూలతో పూజలు చేస్తుంటారు. అలాగే విష్ణు ఆలయానికి వెళ్లే భక్తులు తులసి పత్రిలతో పూజలు చేస్తుంటారు. కార్తీక దీపాలు వెలిగించడం, గంగలో తెప్పలు వదలడం, ఉపవాసదీక్షలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తుంటారు. అందుకే ముఖ్యంగా శివాలయాలు కార్తీక మాసంలో రద్దీగా కనిపిస్తాయి. ఈ ఏడాది ఈ నెల 4న మొదటి కార్తీక సోమవారం, 11న రెండో కార్తీక సోమవారం, 18న మూడో కార్తీక సోమవారం, 25న నాలుగో కార్తీక సోమవారం. ఈ నెల 12న ఏకాదశి, 13న ద్వాదశి, 15న కార్తీకపౌర్ణమి (జ్వోలాతోరణం). మొత్తంగా కార్తీక మాసం హరిహరాదులకు ఇష్టం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. దీంతో ఆయా ఆలయాల్లో కమిటీలు ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకున్నాయి.

సంక్షోభంలో నౌపడ ఉప్పు

(ఐదో పేజీ తరువాయి)

వంద లీటర్ల డీజిల్ అవసరం అవుతుంది. ప్రస్తుతం డీజిల్ రూ.98 పలుకుతుంది. డీజిల్‌తో పాటు కూలీలు, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మొత్తంగా రూ.30వేల పెట్టుబడి అవుతుంది. మరోపక్క నాణ్యతమైన ఉప్పు తయారీ చేయడంలో ఈ ప్రాంత రైతులకు అవగాహన లేకపోవడంతో సరైన ధర రాక నష్టపోతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు ఉప్పు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మాత్రం తమ పరిశ్రమల్లో వాటికి మెరుగులు దిద్ది పదిరెట్ల ఎక్కువకు అమ్ముతున్నారు.

ఒక్క ఒడిశాకే ఎగుమతి..

గతంలో నౌపడలో పండించే ఉప్పును రైల్వే వ్యాగన్ల ద్వారా ఒడిశా, బెంగాల్, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేది. రవాణా ఖర్చులు కూడా తక్కువగా ఉండేవి. అయితే, 1980 తర్వాత రైల్వే లైను ఎత్తివేయడంతో రవాణా చార్జీలు పెరిగి నౌపడ ఉప్పు పరిశ్రమ వైభవం తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఒక్క ఒడిశా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఉప్పు ఎగుమతి అవుతుంది. దేశంలోని ఉప్పు మార్కెట్‌ను గుజరాత్ ఆక్రమించింది. ఇక్కడ నాణ్యతమైన ఉప్పు పండించకపోవడంతో పరిశ్రమ రోజురోజుకీ దిగజారుతుంది. దీంతో వ్యాపారులు నౌపడ ఉప్పు పరిశ్రమను శాసిస్తూ, తమకు నచ్చినంత ధరను ఇస్తూ దోచుకుంటున్నారు.

రైతుల ప్రతిపాదనలు ఇవే..

నౌపడ ఉప్పు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దీని కోసం కొన్ని ప్రతిపాదనలు చేస్తున్నారు.

● నౌపడ ఉప్పు పరిశ్రమను ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేయాలి. కూలీలకు ఉపాధి హామీ ద్వారా కొంత మొత్తం చెల్లించాలి. ● రైతులకు అందిస్తున్నట్లు ఉప్పు పంటకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలి. ● పంటను నిల్వ చేసేందుకు గిడ్డంగులు ఏర్పాటు చేయాలి. ● తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఉప్పు రైతులకు కూడా పరిహారం అందించాలి. ● కౌలు రైతులకు బ్యాంక్ ద్వారా అందిస్తున్న వ్యవసాయ రుణాలు మాదిరిగా ఉప్పు పండించే కౌలు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందివ్వాలి. ● నాణ్యతమైన ఉప్పు పండించేందుకు నిపుణులతో శిక్షణ ఇప్పించాలి. ● ఈ ప్రాంతంలో అయోడిన్ ఉప్పు తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయాలి. దీనివల్ల గిట్టుబాటు ధర లభిస్తుంది. ● ఈ ప్రాంతంలో ఉప్పును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

ప్రభుత్వాలు ఆదుకోవాలి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటే నౌపడ ఉప్పు పరిశ్రమ మనుగడ సాధిస్తుంది. నాణ్యతమైన ఉప్పు పండించేందుకు రైతులకు నిపుణులతో శిక్షణ ఇప్పించాలి. తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించాలి. ఉచిత విద్యుత్ అందించాలి.

-రవికుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సన్నకార ఉప్పు ఉత్పత్తి సంఘం

దేశభక్తి పెంపొందించేలా..

- వీరులజీవిత గాథలపై విద్యార్థులకు పోటీలు
- వీర్‌గాథ-4.0 పేరుతో మూడు దశల్లో ఎంపిక
- జాతీయ స్థాయిలో సూపర్-100 విజేతలు
- గణతంత్ర దినోత్సవం నాడు సత్కారం
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ

పాఠశాలలో విద్యార్థులు



హరిపురం/ వజ్రపుకొత్తూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా వీర్‌గాథ-4.0 పోటీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఈ పోటీలు నిర్వహించనుంది. రక్షణ, విద్య మంత్రిత్వశాఖలు సంయుక్తంగా ఈ పోటీల నిర్వహణకు హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. ముందుగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వీర్‌గాథ పోర్టల్‌లో నమోదు చేయాలి. గ్యాలెంటరీ అవార్డు గ్రహీతలైన సైనికవీరుల ధైర్యసాహసాలు, త్యాగాలు, జీవితగాథలను నేటి విద్యార్థులకు పరిచయం చేయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. వెబ్ సమావేశాల ద్వారా వివిధ సెషన్లలో దృశ్యరూపకంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఎంపిక ఇలా..

జిల్లా స్థాయిలో నవంబరు 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో నవంబరు 12 నుంచి 30వ తేదీ వరకు, జాతీయ స్థాయిలో డిసెంబరు 4 నుంచి 24వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. సీబీఎస్ఈ పాఠశాలలు మినహా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ అర్హులే. ఈ నెల 6వ తేదీ లోగా పాఠశాల స్థాయిలో కవితారచన, వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి కేటగిరిలో మొదటి స్థానంలో నిలిచిన ఎంట్రీలు మొత్తం నాలుగు ఎంట్రీలు హెచ్‌ఎం మైగౌట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు జిల్లా స్థాయిలో మొదటి నలుగురిని, రాష్ట్ర స్థాయిలో మొదటి ఎనిమిది మందిని, జాతీయ స్థాయిలో మొదటి వంద మందిని (సూపర్-100) ఎంపిక చేసి రానున్న గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు. వీరిని సూపర్-100 విజేతలుగా పిలుస్తారు. దీనిలో మూడు నుంచి ఐదో తరగతి వరకు 25మందిని, ఆరు నుంచి ఎనిమిదో తర గతి వరకు 25 మందిని, తొమ్మిది, పది తరగతులకు చెందిన 25 మందిని, ఇంటర్ నుంచి 25 మందిని మొత్తంగా వంద మందిని జాతీయ స్థాయిలో ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోని విజేతలకు ధ్రువ పత్రాలు అందజేస్తారు. జాతీయ స్థాయి విజేతలకు రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖలు రూ.10 వేలు చొప్పున నగదు అందజేస్తాయి.

జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల వివరాలు..

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	1915	45,018
ప్రాథమికోన్నత	315	22,569
ఉన్నత	419	79,497
హైస్కూల్ ప్లస్, ఆదర్శ, వసతి గృహాలు, జూనియర్ కళాశాలలు	60	12,822

కేటగిరీల వారీగా పోటీలు..

కేటగిరి	తరగతులు
1	3,4,5
2	6,7,8
3	9,10
4	ఇంటర్మీడియట్

విద్యార్థులకు మంచి అవకాశం..



విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందిం చేందుకు వారిలోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇదొక చక్కటి అవకాశం. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తారు. అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి. జాతీయ స్థాయిలో తమ ప్రాంతానికి తగిన గుర్తింపు తీసుకురావాలి.

-మద్రిపాటి లక్ష్మణరావు, ఎంఈవో, మందస

అన్ని పాఠశాలలు పాల్గొనేలా చర్యలు..

పోటీల్లో అన్ని పాఠశాలలు నుంచి ఎక్కువమంది విద్యార్థులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే హెచ్‌ఎంలకు మార్గ నిర్దేశం చేశాం. ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలను వీర్‌గాథ వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి మొదటి స్థానం లభించిన నలుగురిని ఎంపిక చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. మంచి ప్రతిభ కనబరిస్తే జిల్లాకు ప్రతిష్ఠ పెరుగుతుంది.

-ఎస్.తిరుమల చైతన్య, డీఈవో



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కేంద్రమంత్రి, శాప్ చైర్మన్ తదితరులు

జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఏపీలో 2028లో నేషనల్ గేమ్స్‌కు చర్యలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని క్రీడలకు సకల సదుపాయాలు కల్పించి జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రితో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. క్రీడలు నిర్వహించాలంటే ఎంతో వ్యవ ప్రయాసలతో కూడుకున్నపని అని, గత వైసీపీ ఐదేళ్లలో క్రీడలను భూస్థాపితం చేశారని, నేడు విద్యా శాఖామంత్రి నారా లోకేష్ చొరవతో క్రీడలకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో 2014-19 మధ్య కాలంలో కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని, అది మధ్యలో ఉన్నప్పటికీ వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు కొనసాగుతున్నాయన్నారు. మరో ఏడు నెలల్లో క్రీడాకారులకు అందుబాటులో తెస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా పాత్రునివలస దగ్గర 32 ఎకరాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ.. దేశంలో జిల్లాకు ప్రత్యేకస్థానం ఉందని, కరణం మల్లేశ్వరి వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లాకి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చారన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదులకు, మొబైల్ గేమ్స్ వరకే పరిమితమవుతున్నారని, దాంతో తీవ్ర మానసిక ఒత్తిడిలకు గురిఅవుతున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఒక గంట సమయం క్రీడలవైపు కేటాయించాలన్నారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి, జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అంతకుముందు జాతీయ పతకాన్ని ఎగుర వేశారు. డీఈవో తిరుమల చైతన్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి బీవీ రమణ, జిల్లా పీఈటీ సంఘం అధ్య క్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి పాల్గొన్నారు.


శిథిలావస్థకు చేరుకున్న టీటీడీ సత్రం

నిర్వహణ లేక.. వినియోగానికి నోచుకోక

● శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు నోచుకోని వైనం ● ఇదీ శ్రీకూర్మంలో టీటీడీ సత్రం దుస్థితి

గార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని టీటీడీ సత్రం నిర్వహణ లేకపోవడంతో వినియోగానికి నోచుకోని పరిస్థితి నెలకొంది. దూరప్రాంతాల భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం 1972లో నిర్మించిన చౌల్ట్రీ భవనం మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో భక్తులు వసతి పొందేందుకు పదిగదులతోపాటు వివాహాల నిర్వహణకోసం కల్యాణ వేదికను కూడా నిర్మించారు. ఈ భవనం నిర్వహణను స్థానిక శ్రీకూర్మం క్షేత్రం అధికారులకు అప్పగించారు. అప్పటి నుంచి నిర్వహణ లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ భవనం బీటలు వారి పిచ్చిమొక్కలతో కనిపిస్తోంది. దీంతో ఇక్కడకు పిండ ప్రదానాలు చేసుకొనేందుకు వచ్చేవారు అవస్థలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీకూర్మంనాథుని దర్శించుకొని వసతి పొందేందుకు శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో శిథిలావస్థకు చేరిన భవనం దుస్థితి దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి స్థానిక శ్రీకూర్మం క్షేత్రం ఈవో జి.గురునాథరావు ఇటీవల తీసుకువెళ్లారు. సంబంధిత ఇంజనీర్లు ద్వారా ఈ శిథిలభవనాన్ని పడగొట్టించేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే గొండు శంకర్ శ్రీకూర్మం క్షేత్రంలో గల టీటీడీ సత్రాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న సత్రం స్థానంలో కొత్త భవనం మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా శిథిలా వస్థకు చేరుకున్న టీటీడీ సత్రం భవనం పడగొట్టించేందుకు చర్యలు తీసుకుం టున్నామని శ్రీకూర్మం క్షేత్రం ఈవో జి.గురునాథరావు తెలిపారు. ఇందుకు సంబంధిత ఇంజనీర్ కూడా వచ్చి పరిశీలించి వెళ్లారని చెప్పారు.

అమ్మో.. ఆ మలుపులు

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయని వైనం

● ఇదీ జి.సిగడాం మండలంలో పరిస్థితి

జి.సిగడాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీ రహదారులపై గల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఏపాటి ఏమరపాటుగా ఉన్నా మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. జి.సిగడాం ఉన్నతపాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మలుపులు, దవళపేట, జగన్నాథవలస, వెంకయ్యపేట, గెడ్డకంచారం గ్రామాల వద్ద బీటీ రహదారుల వద్ద ఉన్న మలుపులు వాహనచోదకులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జి.సిగడాంలోని విద్యా సంస్థలు, రైల్వేస్టేషన్ వెళ్లేందుకు ప్రయాణికులతో రద్దీగా ఉండే ఉన్నత పాఠశాల, కళాశాల సమీపంలో మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న విన్నపాలను అధికారులు పట్టించుకోవడంలేదు. వీటికితోడుగా రైతులు బీటీ రహదారులను కళ్లాలుగా వినియోగించి పంటలను రాసులుగా వేయడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైన అధికారులు రోడ్లకు ఇరువైపుల ఉన్న ముళ్లకంచెలను తొలగించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.


జి.సిగడాం ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మలుపు

రోడ్డుపైకి రెల్ల పొదలు..

రాకపోకలకు బేజారు

● అలికాం-బత్తిలి ప్రధాన మార్గంలో ఇరువైపులా ఏపుగా పెరిగిన వైనం


అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుకు రెండువైపులా పెరిగిన రెల్లపొదలు

ఎల్.ఎన్.పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డులో రావిచెంద్రి జంక్షన్ నుంచి కోవిలాం కాలనీ వరకూ రెండు కిలోమీటర్ల మేర రెల్లపొదలు రోడ్డుపైకి వచ్చేలా ఏపుగా పెరగడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. చోదకులు వాహనాలు నడిపే సమయంలో రెల్లపువ్వులు ఎగిరి కళ్లల్లోకి పడుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డుకు రెండు వైపులా ఉన్న రెల్లపొదల పువ్వులు గాలి వీచే సమయంలో కళ్లల్లో పడితే కంటి చూపుపై పడే ప్రభావముందని పలువురు ఆందోళన చెందుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎల్.ఎన్.పేట చేరుకోవడానికి ఇది ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వారు పొదల వద్ద అవస్థలకు గురవుతున్నా రు. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుకు రెండు వైపుల ఉన్న రెల్లపొదలను తొలగించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

సాహిత్య లోకానికి కారా మాస్టారు ఆదర్శం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


కారా మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాహిత్య లోకానికి కారా మాస్టారు ఆదర్శమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం సాహితి స్రవంతి ఆధ్వర్యంలో కథా నిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత కాళీపట్నం రామారావు(కారా) మాస్టారు శతజయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక కథలు రాసి సాహిత్యంలో సుస్థిరమైన స్థానం సంపాదించి శ్రీకాకుళం జిల్లా గౌరవాన్ని ఇనుమడింపజేశారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ కారా కథలతో సామాజిక బాధ్యతలను గుర్తుచేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజిని మాట్లాడుతూ కారా మాస్టారు కథల కోసం లైబ్రరీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కారా మాస్టారు కుమారులు కారా సుబ్బారావు, కారా ప్రసాద్‌ను సన్మానించారు. రచయిత దుప్పల రవికుమార్ యజ్ఞం కథ ప్రతిఫలనాలు పత్ర సమర్పణచేశారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి అధ్యక్షుడు చీకటిదివాకర్, ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, సాహితీ స్రవంతి ప్రతినిధి కేతవరపు శ్రీనివాస్, పీవీ నరసింహులు, చింతాడ రామారావు, రాజాం రచయితల సంఘం అధ్యక్షుడు గార రంగనాథం పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులపై వేధింపులు ఆపాలి

● పథకం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి


నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికులు

ఇచ్ఛాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులపై వేధింపులు, తొలగింపులు పెరిగాయని ఆ పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి తెలిపారు.ఇప్పటికైనా వేధింపులు ఆపాలని కోరారు. ఆదివారం ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఏజెన్సీకార్మికులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు వేధింపులకు నిరసనగా ఈనెల 11న శ్రీకాకుళం డీఈవో కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం కార్మికులు నిరసన తెలిపారు.

తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం విద్యార్థుల ఎంపిక

ఇచ్ఛాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురానికి చెందిన నలుగురు విద్యార్థులు గతనెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈనెల ఎనిమిదో తేదీన మధ్యప్రదేశ్‌లోని బోపాల్‌లో జరగనున్న 68వ జాతీయస్థాయి పోటీల్లో 78 కేజీల కేటగిరిలో ఎ.రేవంత్, 51కేజీల కేటగిరిలో నీలాపు భగవాన్ పాల్గొంటారని చెప్పారు. అలాగే అంతర్ యూనివర్సిటీ సెలక్షన్స్‌లో గతనెల 30న డాక్టర్ అంబేద్కర్ యూనిర్సిటీ జరిగిన పోటీల్లో 53కేజీల కేటగిరిలో ఎ.భువనేశ్వరి, 65 కేజీల కేటగిరిలో ఉప్పాడ అను సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.ఈమేరకు ఆదివారం విద్యార్థులను క్రీడాకారులు డి.సుమన్, బి.కృష్ణయ్య, సీహెచ్ మదుకుమార్, ఎల్సీరావు తదితరులు అభినందించారు.

స్విమ్మింగ్ పోటీలకు..

ఇచ్ఛాపురం ప్రభుత్వ, స్వర్ణభారతి జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-19విభాగం స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం నుంచి నరసరావుపేటలో జరగనున్న పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకుచెందిన గోవింద్ బెహరా,తరుణ్‌బెహరా, సాగర్ బెహరా, స్వర్ణభారతి విద్యార్థులు రాజుబెహరా, నిరాకర్‌బెహరా పాల్గొంటారని కోచ్ బత్తుల రామారావు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను సురంగిరాజా మైదానంలో సీనియర్ క్రీడాకారులు డి.సుమన్, వెంకటరమణ, సీహెచ్‌లోహిదాస్, యోగి,మురళి, ఎల్.నరసింహమూర్తి, ఉమాశం కర్, ఎల్ఐసీ బుజ్జి, సీహెచ్ వెంకటరమణ అభినందించారు.

ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తాం: కూన

బూర్జ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిస్తామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని గోపిదేవిపేట నుంచి బూర్జిమానుగూడ వరకు, మదనాపురం ప్రధాన రోడ్డు నుంచి అనంతగిరి వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి లేక గిరిజనులు అవస్థల పడ్డారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, జేఈ నాగభూషణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

● కోడిరామ్మూర్తి స్టేడియానికి పూర్వవైభవం తీసుకువస్తాం: శాప్ చైర్మన్

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. కోడిరామ్మూర్తి స్టేడియానికి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. ఆదివారం శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియం పనులను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో క్రీడావికాశకేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామస్థాయి క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడలకు వెళ్లేందుకు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొనే విధంగా కృషిచేస్తామని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కోడిరామ్మూర్తి స్టేడియాన్ని మల్టీపర్పస్ స్టేడియం చేయాలన్నదే లక్ష్యమని, 90 శాతం పనులు పూర్తయ్యాయని, గత ప్రభుత్వం పనులు నిలిపివేసిందని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు శ్రీకాకుళం పర్యటన వచ్చినప్పుడు స్టేడియం గురించి ప్రస్తావించానని, ఆయన సానుకూలంగా స్పందించి నిధులు విడుదలకు హామీ ఇచ్చారన్నారు.


స్టేడియం పనులను పరిశీలిస్తున్న రవినాయుడు

ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం ప్రారంభంకావడంతో తెల్లవారు నుంచే ఆదిత్యుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.5,77,086ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,67,000 విరాళాల ద్వారా రూ.77,166లు, ప్రసాదాల రూపంలో రూ.2,32,920ల ఆదాయం చేకూరినట్లు ఈవో వై.భద్రాజీ తెలిపారు.స్వామివారిని శ్రీకాకుళానికి చెందిన మన్మథరావు, సరోజనమ్మ దంపతుల కుమారుడు బలివాడ ప్రభాకరరావు, సత్యవతి దంపతులు శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,00,001 చెక్కు, విశాఖపట్నంలోని ఎన్ఏడీ కొత్త రోడ్డుకు చెందిన వైశ్యరాజు సురేష్ చంద్రరాజ్, ఉషారాణి దంపతులు స్వామివారి అన్నదాన పథకానికి రూ.1,00,116ల చెక్కును ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనక రాజుకు అందజేశారు. కాగా స్వామివారిని శ్రీకాకుళం ఆర్డీవో ప్రత్యూష ఆదివారం దర్శించుకున్నారు.


క్యూలైన్‌లో కిటకిటలాడుతున్న భక్తులు

పీఆర్ డిప్లమో ఇంజనీర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక


జిల్లా కార్యవర్గం ఎన్నికలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర

శ్రీకాకుళం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కేసీహెచ్ మహంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్లసంఘం జిల్లా కార్యవర్గఎన్నిక రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర, రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబు, సంయుక్తకార్యదర్శి ఎ.చంద్రునాయుడు నేతృత్వంలో నిర్వహించారు. ఈమేరకు అధ్యక్షుడిగా పదమూడోసారి ఏకగ్రీవంగా కేసీహెచ్ మహంతిని సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎం.పోలినాయుడు, కార్యదర్శిగా ఎస్వీఏ పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.రమేష్, కోశాధికారిగా బి.కృష్ణారావు ఎన్నికయ్యారు. సలహాదారుడిగా పల్లి నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా బి.నరసింగరావు, కె.శ్రీధర్, పి.శ్రీధర్, డీవీ గోపీకృష్ణ, వీఎస్ గుప్తా, బీవీ విశ్వనాథరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్లకు ఈఈలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): డిప్లమో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచుతూ ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సెల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒకప్రకటనలో తెలిపారు. డిప్లమో పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తులకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు ఈనెల 12 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్‌లో ఏ గ్రూపులోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకోసం 7680945357, 7995013422 ఫోన్‌నంబర్లకు సంప్రదించాలని కోరారు. రాగోలులోని జెమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రోస్టర్ పాయింట్లను సరిచేయండి

గుజరాతీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నగరపాలక సంస్థ, మునిసిపల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాల్లో రోస్టర్ పాయింట్లు తప్పులతో ఉన్నాయని, వాటిని తక్షణమే సరిచేయాలని ఏపీయూఎస్ జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు కోరారు. ఆదివారం శ్రీకాకుళంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలోని ఇదివరకు జరిగిన పదోన్నతులు రోస్టర్‌పాయింట్లకు, ఇప్పుడు జిల్లావిద్యాశాఖ చూపుతున్న రోస్టర్ పాయింట్ల చాలా వ్యత్యాసం ఉండడంతో తక్షణమే సరిచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డి.చలపతిరావు, ఆనందరావు, పి.కాశీవిశ్వనాథ్, ఎస్.నర్సింగరావు, సీహెచ్ రమణ, బి.రవి, జె.రజనీకాంత్ పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి

పొందూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):శిష్టకరణాలను ఓబీసీ జాబితాలోకి చేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శిష్టకరణ సంక్షేమసంఘం మండల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం పొందూరులో పొందూరు, జి.సిగడాం మండలాల శిష్టకరణ సంఘం సమావేశం నిర్వహించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతీసుకొని ఓబీసీ జాబితాలోకి మార్చేందుకు కృషిచేయాలని కోరారు. పొందూరు, జి సిగడాం మండలాల శిష్టకరణ వణభోజనం ఈనెల 24న నిర్వహిస్తున్న తెలిపారు.కార్యక్రమంలో సంఘసభ్యులు వి.దామోదరరావు, కె.రవికుమబార్, వి. నిరంజన్, వి.ఉమ, కె.సతీష్, మన్మథరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

సోంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం సోంపేట జైభీమ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన సమావేశంలో జైభీమ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా చల్లా దేవరాజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నగిరి మోహనరావు, బుష్క ఈశ్వరరావు, డొప్ప వెంకటరావు పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే కేసు: సీఐ

సోంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానిపై కేసునమోదుచేస్తామని సీఐ బి.మంగరాజు తెలిపారు. ఆదివారం సోంపేటలో ఎస్ఐ బీ.హైమావతితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్ గేమ్‌పై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బీచ్‌లో పటిష్ట భద్రత

బారువ బీచ్‌లో కార్తీకమాసంలో వనభోజనాలు, సముద్రస్నానాలు దృష్ట్యా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు మెరైన్ సీఐ డీవీజే రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సముద్రంలో స్నానం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, మద్యంసేవించి సముద్ర స్నానంచేయరాదని పేర్కొన్నారు.మహిళలు జనసందోహంలో ఉండాలని సూచించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

లావేరు, నవంబరు 3: (ఆంధ్రజ్యోతి):మండలంలోని మురపాక గ్రామానికి చెందిన ఎండ విజయలక్ష్మి అదృశ్యమైనట్లు లావేరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు..ఎచ్చెర్లలోని ఓ ప్రైవేటు కాలేజీలో విజయలక్ష్మి ఆయాగా పనిచేస్తోంది. రోజూ మాదిరిగానే గతనెల 23న ఉదయం ఎనిమిది గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు విజయలక్ష్మి భర్త ఎండకుమార్ ఆదివారం లావేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీంతోకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

క్రీడలపై విద్యార్థులు దృష్టిసారించాలి

శ్రీకాకుళంస్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై దృష్టిసారించాలని, అందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు.ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్‌కళాశాల ఆవరణలోగల ఆడిటోరియంలో ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల ఉషు పోటీలను ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లగా క్రీడలు నిర్వీర్యమయ్యాయని, వాటిని పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కోడిరామ్మూర్తి స్టేడియాన్ని మల్టీపర్పస్‌గా నిర్మించి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా కార్యదర్శి బీవీ రమణ, ఉషు సంఘం ప్రతినిధులు కొమర భాస్కరరావు, శివకుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో చదరంగం పోటీలు

జిల్లాలో అన్నిపాఠశాలల్లో చదరంగం క్రీడను పరిచయం చేసి అభివృద్ధిచేస్తామని ఆలిండియాచెస్ ఇన్‌స్కూల్ కమిటీ సభ్యులు సనపల భీమారావు తెలిపారు.ఆదివారం శ్రీకాకుళంలో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-10, 12,14 విభాగాల్లో జిల్లాస్థాయి చదరంగంపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 82 మంది క్రీడాకారులు పాల్గొనగా, విజేతలకు చౌదరి నారాయణ మూర్తి, వేణుగోపాల్, శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. ఇక్కడవిజేతలుగా నిలిచినవారు ఈనెల 17న అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

నేడు అక్కమాంబ బోనాలు ఉత్సవం

పొందూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొందూరు గ్రామదేవత, నాగవంశం సామాజికవర్గ కులదేవత అక్కమాంబతల్లి బోనాలు ఉత్సవం సోమవారం నిర్వహించనున్నారు. బోనాలు ఉత్సవానికి కమిటీ సభ్యులు సర్వం సిద్ధంచేశారు. ఏటా కార్తీక మాసం మొదటిసోమవారం అక్కమాంబ తల్లి బోనాలు ఉత్సవాలు నిర్వహిస్తారు. స్థానిక నాయుడు వీధినుంచి అక్కమాంబ ఆలయానికి మూడుసార్లు బోనాలు తిప్పుతారు. ఈసందర్భంగా అక్కమాంబపేరంటాలను ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఉదయం నుంచి వేలాదిమంది భక్తులు తల్లిని దర్శనం చేసుకుంటారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

లావేరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 తేదీ వరకు 57వ జాతీయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.ఆదివారం లావేరు శాఖాగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. వారోత్సవాలకు సంబందించిన పుస్తకాలు అందుబాటులో ఉంచామని చెప్పారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు కోరారు. ఆదివారం మండలంలోని జలంత్రకోట, గోకర్ణపురం పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు.

రబీకి విత్తనాలు సిద్ధం

ఆమదాలవలస, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపేనపేట కస్టర్ యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది రబీ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలను సిద్ధం చేసినట్లు డిజిటల్ ఎల్‌టు సురేష్ తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో అపరాల్లో అంతర పంటలకు అవసరమైన విత్తనాలను సమకూర్చినట్లు చెప్పారు. రబీలో అపరాలులో అంతర పంటలుగా కట్టే జనం, మొక్కజొన్న, గోరు చిక్కుడు, బెండ, గోంగూర విత్తనాలను వరుసల్లో పొ లం చుట్టూ వేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు.

అలరించిన మ్యూజికల్ నైట్

శ్రీకాకుళంకల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన గాయకుడు బారతి రమేష్ కెన్యాలో ఆదివారం తెలుగు కల్చరల్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు అలరించారు.

బారువలో టీడీపీ సభ్యత్వ నమోదు

సోంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : బారువలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, నాయకులు మద్దుకుమార్, దున్న సత్యం, రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

రక్షిత జలం.. అందనంత దూరం

- తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సీది గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

హిరమండలం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అల్లాడుతున్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యంగా అక్కురాపల్లి పంచాయతీ సీది గ్రామం నిలుస్తోంది. గ్రామంలోని నీటి పథకం పని చేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మోటారు తరచూ పాడవుతుండడంతో ఎప్పటికప్పుడు నీటి సరఫరా నిలిచిపోతోంది. గడచిన ఏడాది కిందట ఇదే పరిస్థితి ఎదురవడం అప్పటి నుంచి దానిని పట్టించుకునేనాథుడే కరవవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామంలో గిరిజనులు, బీసీలు కలిపి సుమారు 200 ఇళ్లున్నాయి. నీటి పథకం పనిచేయకపోవడంతో గ్రామం చివర ఉన్న బావులు, బోర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా గ్రామానికి ఉన్న నీటి పథకం పైప్‌లైన్లు మురుగుకాలువల్లో ఉండడంతో పాడై నీరు కలుషితం అవుతోందని వాపోతున్నారు. దీంతో తరచూ అనారోగ్యంబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని తాగు నీటి ఇబ్బందులను తొలగించాలని స్థానిక మహిళలు, గ్రామస్థులు కోరుతున్నారు.





మూలకు చేరిన వాటర్‌ట్యాంకు, కాలువలో ఉన్న పైపులైన్లు

అవస్థలు పడుతున్నాం



ఏడాదిన్నరగా రక్షిత నీటి పథకం పని చేయడం లేదు. దీంతో గ్రామంలో ఉన్న బావులు, రెండు బోర్లు నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. ఇప్పటి కైనా అధికా రులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-గొర్లె చిన్నమ్మడు, సీది గ్రామం

ఎవరూ పట్టించుకోవడంలేదు



గ్రామంలో కొళాయిల నుంచి నీరు రాకపోయినా అధికారులు, నేతలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నీటి పథకం మోటారు పాడై ఏడాది దాటింది. అప్పటి నుంచి కలుషిత నీటిని తాగుతున్నాం. కొళాయి లున్నా నిరుపయోగమే..

- హరిపురం కళావతి,సీది గ్రామం

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ప్రైవేట్ లైన్‌మన్‌కు తీవ్రగాయాలు

హరిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హరిపురం కాపు వీధికి చెందిన ప్రైవేటు లైన్‌మన్ పి.సాయికుమార్ ఆదివారం విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఐటీఐ చదివిన సాయికుమార్ లైన్‌మన్ వద్ద ప్రైవేట్‌గా విద్యుత్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. షాక్‌కు గురై స్తంభం పైనుంచి కిందకి పడడంతో తలకు, ఛాతీకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో హరిపురం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

జలుమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిలారు ఆర్.ఎస్ సమీపంలోని టేకు తోటల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,060 స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం దాడిచేసి వారిని పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. అనంతరం స్టేషన్ బెయిల్ పై విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

నందిగాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలవలస సమీపంలో హైవేపై ఆదివారం సాయంత్రం పెద్ద ప్రమాదం తప్పింది. కవిటి మండలం సహలాలపుట్టుగకి చెందిన పలువురు వాహనంలో శ్రీకాకుళం వెళ్లి తిరిగి వస్తుండగా పాలవలస వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో మేజిక్ వాహనంలో ప్రయాణిస్తున్న వై.సారధి, చైతన్య, చంద్రమణి ప్రధాన్, పి.రాములకు స్వల్ప గాయాలయ్యాయి. వీరు టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం స్వగ్రామానికి వెళ్లారు. ఈ ప్రమాదంపై పోలీసులకు వివరాలు అడుగగా ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.

చెరువుల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

పలాస, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఉన్న చెరువుల్లో పూడికలు తీసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఆదివారం ముత్యాలమ్మ కోనేరు, భద్రం కోనేరు, రాధాకాంత చెరువులను పరిశీలించారు. గతనెల జరిగిన మునిసిపల్ సమావేశంలో కార్తీకమాసం సందర్భంగా చెరువులను శుభ్రం చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పరిశీలించారు. తక్షణం పూడికలు తీసి, లైటింగ్ ఏర్పాటు చేయాలని, బ్లీచింగ్ చల్లించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. 11, 14, 20 వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు.

బాలియాత్రను విజయవంతం చేయండి

జలుమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభిస్తున్న బాలియాత్రలో కళింగరాజ్య సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం సభ్యులు డి.జీవితేశ్వరరావు, బి.శ్రీరామ్, ఎస్.జగదీష్, హెచ్‌వీ దొర కోరారు. ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళింగుల ప్రాచీన రాజధాని కళింగ నగరం (శ్రీముఖలింగం)లో ఈ యాత్ర చేపట్టనున్నామన్నారు. ఎంతో విశిష్టత కలిగిన కార్తీక పౌర్ణమి మరుసటి రోజున బాలి యాత్ర చేపట్టి అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి వంశధార నదిలో విడిచిపెట్టి నదీమ తల్లిని ప్రార్థించాలన్నారు. ఈ దీపాలు వెలిగించడం ద్వారా మన పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, శ్రీకృష్ణ, అప్పారావు, వెంకటాచలం, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

పోలాకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నారాయణరావు అన్నారు. వెలుగుకార్యాలయంలో ఆదివారం రైతు ఉత్పత్తిసంఘాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 45 రకాల ఉత్పత్తులను ఎంపిక చేసి సభ్యులకు తెలిపామన్నారు. జిల్లాలో 27,800 సంఘాల సభ్యులకు ఆన్‌లైన్‌లో పరిశ్రమలను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఆధునిక వ్యవసాయం, యంత్రాలు, మునగసాగు వంటి పనులపై అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలకు జీవనోపాధి కల్పించే దిశగా మూడు స్థాయిలో యూనిట్లను అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉందన్నారు. కార్యక్రమంలో ఏసీ కొండలరావు, ఏపీఎం రాజారావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కొయ్యాన వెంకటలక్ష్మి, శిక్షకుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

నందిగాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం నందిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి సాంస్కృ తిక పోటీలు నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు ఏకపాత్రాభినయం, జానపద నృత్యాలు, జానపద గీతాలాపన, మిమిక్రీ తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. విజేతలకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమారస్వామి, వై.గణపతిరావు, హైస్కూల్ హెచ్‌ఎం వై.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



నిరసన తెలుపుతున్న గిరిజనులు

హిరమండలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాండ్రమానుగూడ, బలదగూడ గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. ఆదివారం ఈ రెండు గ్రామాల గిరిజనులతో నిరసన తెలిపారు. రహదారి సమస్యలపై గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పరిష్కరించలేదన్నారు. ఇటీవల రహదారి పనులు ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు లేవన్నారు. తక్షణం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

- ఆర్డీవో కృష్ణమూర్తి



టెక్కలి: వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జున స్వామిని సోమవారం దర్శించుకునేందుకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కూడదని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ దేవదాయ శాఖాధికారులతో మాట్లాడారు. వాహనాల మార్కింగ్, రాకపోకల మార్గాల ఏర్పాటు, ప్రసాదాల పంపిణీ, తాగు నీరు, మజ్జిగ పంపిణీల్లో ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. భక్తుల సజావుగా దర్శనం చేసుకునే విధంగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవో గురునాథరావు, సీఐ విజయ్ కుమార్, కార్యదర్శి రవి, టీడీపీ సీనియర్ నేత ఎల్ఎల్ నాయుడు, మాజీ సర్పంచ్ బడే జగదీష్, జనసేన నాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్తీక సోమ వారాలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. జగతిమెట్ట దరి జగదీశ్వర ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. లింగాలవలస లింగరాజస్వామి ఆలయం, తిర్లంగి ఉమామహేశ్వరస్వామి ఆలయాలను సిద్ధం చేశారు. కె.కొత్తూరు, నర్సింగపల్లి ప్రాంతాల్లో శివాల యాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పట్టణంలోని పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న రామలింగేశ్వర ఆలయం, మెయిన్ రోడ్డులోని పెద్దశివాలయంలో ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరుని ఆలయం సిద్ధం

జలుమూరు, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి) సుప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో శ్రీముఖ లింగేశ్వర స్వామి ఆలయాన్ని కార్తీక మాసం ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీ పాలతో అలంకరించారు. మొదటి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుచేస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ప్రత్యేక, ఉచిత దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటుచేశామన్నారు. షామియానాలు, తాగునీటి సదుపాయం కల్పించామన్నారు.

పూజలకు సిద్ధమవుతున్న శివాలయాలు

పలాసరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో కార్తీకమాస సోమవారాలకు శివా లయాలు సిద్ధమవుతున్నాయి. బ్రాహ్మణతర్లా ఉమాలింగేశ్వరుడు, అల్లుకోల సిద్ధేశ్వరుడు, తర్లాకోట కోటేశ్వరుడు, కేదారిపురం కేదారేశ్వరుడు, నవరగోవిందపురం స్వయంభూ లింగేశ్వరాలయాలను సిద్ధం చేశారు. నవరగోవిందపురం స్వయం భూలింగేశ్వరుడు ఆలయంలో భక్తుల కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.



విద్యుద్దీపాలతో ముఖలింగేశ్వరుని ఆలయం

ఇంటర్వ్యూ

దేవాలయాల ఆదాయం పెంచేందుకు కృషి

- టి.వాసుదేవరావు, ఈవో



మందస, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాలయాలను అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామని గ్రూపు దేవాలయాల ఈవో టి.వాసుదేవరావు అన్నారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని దేవాలయాలున్నాయి. ఎంతమంది అర్చకులున్నారు?

జవాబు: 21 దేవాలయాలకు 21 మంది అర్చకులున్నారు.

ప్ర: దేవాలయాలకు ఎంతమేర భూములున్నాయి?

జ: 300 ఎకరాల పల్లం, మెట్టు భూములు ఉన్నాయి.

ప్ర: ఏమేర ఆదాయం వస్తోంది?

జ: సుమారుగా రూ.7 లక్షల ఆదాయం వస్తోంది.

ప్ర: ఆదాయం పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: కౌలు రైతులతో మాట్లాడి భూముల ఆదాయం కోసం బహిరంగ వేలం పాట వేసి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నాం.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సంతబొమ్మాళి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి అంట్ల వరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం సైబర్ మోసాలకు చాలా మంది బలవుతున్నారన్నారు. అలాగే బాల నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్ఐసింహాచలం, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మాజీ మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్‌మీడియా ప్రతినిధిని విచారణకు తీసుకువచ్చారని తెలుసు కున్న మాజీ మంత్రి అప్పలరాజు ఆదివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ నిహార్ నుంచి వివరాలు అడిగారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల ఒకటిన పింఛన్ల పంపిణీ సందర్భంగా నువ్వలరేవుకు చెందిన ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయిందని, ఆమె కాశీబుగ్గ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. తప్పుడు పోస్టును సామాజిక మాధ్యమాల్లో పెట్టారని వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి మద్దు జస్వంత్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం పిలిచామన్నారు. అదే సమయంలో వివిధ పరామర్శలకు వచ్చిన మాజీ మంత్రి అప్పలరాజు స్థానిక నేతలతో కలిసి వచ్చి జస్వంత్‌పై చేపడుతున్న విచారణపై ఆరా తీశారని ఎస్ తెలిపారు. విచారణ తరువాత జస్వంత్‌ను విడిచి పెట్టామన్నారు.

దేవాలయ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పలాసరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టెక్కలిపట్నం శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయానికి చెందిన భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా దుకాణం ఏర్పాటు చేయడంతో సదరు ప్రదేశంలో ఆదివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దేవాలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఈవో వాసుదేవరావు హెచ్చరించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ఆక్రమణలు జరిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. కాగా దేవాలయభూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపును త్వరితగతిన తొలగించాలని కోరుతున్నారు.

నేడు స్కిల్ సెన్సెస్‌పై శిక్షణ

పోలాకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కిల్ సెన్సెస్‌పై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొంటారన్నారు. సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

మా ప్రభుత్వం మహిళా పక్షపాతి: ఎమ్మెల్యే ఎంజీఆర్



లబ్ధిదారుకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళా పక్షపాతిగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం దువ్వార వీధిలో ఉచితగ్యాస్ పంపిణీని ఆదివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మహిళా సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ఏటా మూడు సిలిండర్లను అందించనున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీవో చంద్రకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, నేతలు రుంకు చలపతిరావు, శ్రీరాం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి పనులు

ఎల్.ఎన్.పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు సాధ్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, బసవ రాజుపేట తదితర గ్రామాల్లో ఆదివారం పలు రోడ్ల నిర్మాణాలను భూమిపూజ చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లు పూర్తిగా పాడైనా పట్టించుకోలేదన్నారు. సీఎం చంద్రబాబు రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసులు, ఏపీవో శ్రీదేవి, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, నేతలు వి.గోవిందరావు, కె.మన్మథరావు, ఎస్.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- శాప్ చైర్మన్‌కు ఎమ్మెల్యే బగ్గు వినతి



శాప్ చైర్మన్ రవినాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో మినీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఆదివారం శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుతో కలిసి ఆదివారం ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియంలో అన్ని పరికరాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలోను క్రీడా వికాస కేంద్రాలున్నాయని వాటికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను జాతీయ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

అరసవల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ తెలిపారు. పంచారామాల క్షేత్ర దర్శిని ప్రత్యేక బస్సును శ్రీకాకుళం 1వ డిపో మేనేజర్ అమరసింహుడు ఆదివారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. అమరావతి (అమరారామం), భీమవరం (భీమారామం), పాలకొల్లు (క్షీరారామం), ద్రాక్షారామం, సామర్లకోట (కుమారారామం) క్షేత్రాలను దర్శించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా డీపీటీవో మాట్లాడుతూ.. ప్రతీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు బస్సులు బయలుదేరి సోమవారం ఐదు పుణ్య క్షేత్రాలను దర్శింపజేసి, మంగళవారం ఉదయం 6 గంటలకు మళ్లీ శ్రీకాకుళం చేరుకుంటామన్నారు. ఈ నెల 10, 17, 23వ తేదీల్లో పలాస, టెక్కలి, శ్రీకాకుళం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు బయలు దేరుతాయన్నారు. ఇందుకు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించామన్నారు. శ్రీకాకుళం నుంచి మనిషి ఒక్కరికి సూపర్ లగ్జరీ రూ.2,400, అల్ట్రా డీలక్స్ రూ.2,350, ఎక్స్‌ప్రెస్ రూ.2వేలు చార్జీలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం డిపో-1 మేనేజర్: 99592 25608, 2వ డిపో: 99592 25609, టెక్కలి డిపో : 99592 25611, పలాస డిపో: 99592 25610 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీరావు, భాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పోలాకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశికి చెందిన మెండ శ్రీనివాసరావుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదానికి గురై బలమైన గాయాలై చికిత్స చేయించుకున్నారు. దీనికి నిధులు మంజూరు చేయాలని సీఎం కార్యాలయానికి ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో ఆదివారం మబగాంలోని క్యాంపు కార్యాలయంలో రూ.3,61,500 చెక్కును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'కొంచాడ' విగ్రహావిష్కరణ

పాతపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిడ్డిమి పంచాయతీకి నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా వ్యవహరించిన దివంగత కొంచాడ వీరభద్రరావు విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. నిస్వార్థ సేవలతో ప్రజల మదిలో సుస్థిర స్థానాన్ని వీరభద్రరావు పొందార న్నారు. సర్పంచ్‌గా, ఏఎంసీ అధ్యక్షుడిగా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా అందరికీ సేవలందిం చారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన వీరభద్రరావు ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయ పరిరక్షకులు కళాకారులు

పాతపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పరిరక్షణకు వారధులు కళాకారులను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తామర గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో కార్తీక మాసం సందర్భంగా 24 గంటలపాటు అఖండ హరినామ సంకీర్త చేపట్టిన కళాకారులను ఆలయ ధర్మకర్త అయిన ఎమ్మెల్యే ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు, ఆలయ నిర్వాహకులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష

పాతపట్నం/వజ్రపుకొత్తూరు/మందస/నందిగాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిక్కోలు గణిత వేదిక దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాతపట్నం, వజ్రపుకొత్తూరు, మందస, నందిగాం ఉన్నత పాఠశాలల్లో ఆదివారం విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్ ఎంలు ఎస్.వైకుంఠరావు, జె.రవికుమార్, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి అమర జనార్దనరావు, ఎంఈవో సత్యం, వేదిక ప్రతినిధులు చింత ఉమామహేశ్వరరావు, గోపాలకృష్ణారావు, ఎ.గోవిందరావు, కె.అప్పారావు, జి.గోవింద రావు, కిరణ్, సురేష్‌కుమార్, శంకరరావు, సురేష్ చంద్ర, అరుణ్‌కుమార్, సింహాచలం, బి.తాతారావు, ఉయ్యూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.